క్లుప్తంగా

వినియోగదారుల సేవలే లక్ష్యం



పెనమలూరు: వినియోగదారుల సేవలే లక్ష్యంగా ఐడీబీఐ బ్యాంకు పని చేస్తుందని బ్యాంకు చీఫ్ జనరల్‌మేనేజర్, జోనల్ హెడ్ ఏ జోసెఫ్‌కుమార్ పేర్కొన్నారు. పోరంకిలో బుధవారం ఐడీబీఐ బ్యాంకు విజయవాడ రీజియన్‌లో 33వ శాఖను ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఐడీబీఐ జనరల్ మేనేజర్ వి.వాసుదేవన్, డీజీఎంలు శైలజ, శార్దుషా, జాయ్‌రాజన్, బ్రాంచి మేనేజర్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఈటీ గౌసానికి సన్మానం



కంకిపాడు: కబడ్డీలో సత్తా చాటిన తెన్నేరు పీఈటీ గౌసానిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం టీఎస్ హనుప్రసాద్ బుధవారం మాట్లాడుతూ ఫిబ్రవరి 20 నుంచి 24వ తేదీ వరకూ జార్ఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల మహిళా కబడ్డీ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా నుంచి తెన్నేరు పీఈటీ గౌసాని రాష్ట్ర జట్టులో పాల్గొందని, విశేష ప్రతిభ చాటడంతో రాష్ట్ర జట్టు పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి ట్రోఫీ, రజత పతకం సాధించినట్లు తెలిపారు. సహ ఉపాధ్యాయులు పీఈటీని అభినందించారు.

పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలి



గన్నవరం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు డిమాండ్ చేశారు. పెరిగిన గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ బుధవారం సీపీఐ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇష్టారాజ్యంగా పెంచుతూ సామాన్యులపై పెనుభారం మోపుతోందన్నారు. ఇప్పటికైన గ్యాస్‌పై పెంచిన రూ.50ను తగ్గించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, పెద్దు వెంకటరత్నం, కెఆర్‌ఎం. జోషీ, కట్టవరపు విజయరావు పాల్గొన్నారు.

పేదలకు భరోసా వైఎస్సార్ బీమా



ఉంగుటూరు: వైఎస్సార్ బీమా పేదలకు భరోసాగా నిలుస్తోందని, ప్రతిఒక్కరూ బీమా నమోదు చేయించుకోవాలని వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ అన్నారు. మానికొండలో గుండె పోటుతో మరణించిన ఎం.సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలు వైస్ ఎంపీపీ బుధవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, శివరామకృష్ణ, బాషా పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గురుమూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేద దినచర్యను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలని రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గురుమూర్తి అన్నారు. బందరు లాకుల వద్ద గల నోరి రామ శాస్త్రి ఆయుర్వేద కళాశాల డైమండ్ జూబ్లీ హాల్లో విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగ్ ఆధ్వర్యంలో విశ్వ మంగళ దివస్ బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం అభివృద్ధికి సమయం ఆసన్నమైందన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు మరింతగా కృషి చేసి ఆయుర్వేదాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఆయుర్వేద వైద్యులు సూచించిన ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. విశ్వమంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో విశ్వ మంగళ దివస్ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ గురుమూర్తిని సత్కరించారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ సాయి సుధాకర్, ఆర్‌డీడీ వెంకట కృష్ణ, సూపరింటెండెంట్ రాజ రాజేశ్వరి, విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ పూర్ణ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లు ధరణికుమార్, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుముతీత పనులు

- అపరాల సాగు ఆశాజనకం
- 18,529 ఎకరాల్లో మినుము సాగు
- 988 ఎకరాల్లో పెసర సాగు



ప్రొద్దుటూరులో మినుముతీత పనులు

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలో అపరాల సాగు ఆశాజనకంగా ఉంది. రబీలో పంట కాలం పూర్తి కావడంతో మినుముతీత పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. తీత పనులతో పాటు నూర్పిడి పనులను చేపడుతున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో రబీలో మినుము, పెసర సాగు చేశారు. కంకిపాడు మండలంలో మినుము ఏడు వేల ఎకరాలు, పెసర 774 ఎకరాల్లో, పెనమలూరు మండలంలో మినుము, పెసర 300 ఎకరాల్లో సాగు చేశారు. ఉయ్యూరు మండలంలో మినుము 11,379 ఎకరాల్లో, పెసర 64 ఎకరాల్లో సాగైంది. ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకూ పెట్టుబడులు పెట్టారు.

అనుకూలించిన వాతావరణం

వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించాయి. తెగుళ్ల బెడద అంతంతమాత్రమే. ఫలితంగా పంట దిగుబడులు గతేడాదితో పోలిస్తే అధికంగానే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ముందుగా సాగుచేసిన మినుము, పెసర పైర్లు అప్పుడే చేతికి వచ్చాయి. దీంతో వారం, పది రోజులుగా మినుము, పెసర తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంటతీత పూర్తి చేసి పంట పొలాల్లో గూళ్లు, కుప్పలు వేస్తున్నారు. కుప్ప నూర్పిడికి అందుబాటులో ఉన్న యంత్రాలను వినియోగించి మినుము, పెసర నూర్పిడి పనులను చేపడుతున్నారు. ఓ వైపు తీత, మరో వైపు నూర్పిడి పనులు సాగుతుండటంతో రైతులు, కూలీలు రబీ సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ

గన్నవరం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి తెహెరా సుల్తానా సూచించారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థినులకు ప్రేరణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్య దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. లక్ష్య సాధన కోసం చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే విజయం తథ్యమన్నారు. ముఖ్యంగా విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమైనవని చెప్పారు. అత్యుత్తమ ఫలితాలను సాధించడం ద్వారా ట్రిబుల్ ఐటీ వంటి ఉన్నత విద్యను అభ్యసించి అవకాశం ఉంటుందని తెలిపారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. తొలుత మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో హెచ్‌ఎంలతో డీఈఓ సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనుల పురోగతిపై, పదో తరగతి పరీక్షలపై ఆమె దిశానిర్దేశం చేశారు. ఎంఈఓ బీ శ్రీనివాస్, హెచ్‌ఎంలు సీహెచ్ అనిత, ఎన్. రవీంద్రభవాని, కేఎస్ జగదీశ్వరరావు, ఆర్. విజయరామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంట గ్యాస్ భారాన్ని ఉపసంహించుకోవాలి

కంకిపాడు: గృహావసర వంట గ్యాస్‌పై కేంద్రం మోపుతున్న భారాలను ఉపసంహరించుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. గృహావసర వంట గ్యాస్‌పై కేంద్రంలోని బీజేపీ సర్కారు రూ.50 భారాన్ని మోపుతూ చర్యలు తీసుకుందన్నారు. బీజేపీ పాలనలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలకు రెక్కలొచ్చాయన్నారు. ప్రజలు భారాలు మోయలేక అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం భారాలను ఉపసంహరించుకుని, ప్రజలకు అండగా నిలవాలని కోరారు.

సున్నా వివక్ష దినోత్సవం

పెనమలూరు: కానూరులో సున్నా వివక్ష దినోత్సవం బుధవారం నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కాలేజీ నుంచి కానూరు వందడుగుల రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ చట్టం అందరికీ సమానమని, న్యాయం విషయంలో వివక్షకు తావులేదన్నారు. సున్నా వివక్ష దినోత్సవం మార్చి 1వ తేదీన నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

వ్యక్తిపై దాడి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తి పై మరో వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కానూరు మురళీనగర్‌కు చెందిన తిరుపతి కోటేశ్వరరావుకు వరుసకు సోదరుడు తిరుపతి వెంకటరమణకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోటేశ్వరరావు పై వెంకటరమణ కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నవధాన్యాల సాగుతో పొలాలకు మేలు



తాడిగడపలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ప్రకృతి వ్యవసాయ ర్యాలీలో పాల్గొన్న రైతులు, విద్యార్థులు

పెనమలూరు: నవధాన్యాల సాగు పంట పొలాలకు మేలు చేస్తుందని విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. తాడిగడప గ్రామంలో బుధవారం పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘాలు, రైతులు అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వీఏఏ గోవర్ధని మాట్లాడుతూ నవధాన్యాల సాగు నేల తల్లికి మేలు చేస్తుందన్నారు. నవధాన్యాల సేద్యం పుడమి తల్లికి నైవేద్యమన్నారు. నవధాన్యాల సాగుతో భూమిలో సారం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 31 రకాల నవధాన్యాల విత్తన గుళికలు ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో టి.రూతు, జె.అంకమ్మరాణి, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూమి సారవంతం

గన్నవరం రూరల్: పంట చేలల్లో నవధాన్యాలు సాగు చేయడంతో జీవ వైవిధ్యం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.సులోచన రాణి అన్నారు. పురుషోత్తపట్నం గ్రామంలో రైతులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరిగేందుకు నవధాన్యాలు వేసుకోవాలన్నారు. పంటలకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అందించే ప్రక్రియను ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహిస్తుందన్నారు. దీంతో నేల గుల్లబారి నీటి నిలువ సామర్థ్యం పెరిగి వానపాములు వృద్ధి చెందుతాయని చెప్పారు. సర్పంచ్ ఎం.రోహిణి, ఎస్‌డీఏ సీతమ్మ, రైతులు వెంకటేశ్వరరావు, సాంబశివరావు, బండి ప్రభుదాసు, లైబ్రేరియన్ కె.కృపానందం పాల్గొన్నారు.

పాస్టర్ ఏసుదాసు మృతి



నున్న(విజయవాడరూరల్): దైవస్వరూపి ప్రార్థన మందిరం పాస్టర్ దేవరపల్లి ఏసుదాసు(72) మంగళవారం నున్న గ్రామంలో ఆయన ఇంటి వద్ద మృతిచెందారు. ఏసుదాసు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల్లో దైవస్వరూపి సహవాసం బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేసి, దేశంలో 18 వందల చర్చిలు ఏర్పాటుకు సహకరించారు.

నర్సింగ్ విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గాంధీ, నగేష్

గన్నవరం: నర్సింగ్ చదువుతున్న డి.దీపికకు కళాశాల ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.10 వేల సాయం చేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో బుధవారం ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, బాపులపాడు ఎంపీపీ యరగొర్ల నగేష్ చేతుల మీదుగా దీపకకు అందజేశారు. ఈ సందర్భంగా నక్కా మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకుడదనే ఉన్నత ఆశయంతో వంశీమోహన్ గత 16 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందించారని చెప్పారు. నర్సింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న దీపక ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే తనవంతు సాయం అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్ కుమార్, గొన్నూరు సీమయ్య, మద్దాల కిన్ను పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు



గన్నవరం: స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డు లోని పౌర సరఫరాల శాఖకు చెందిన ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి తనిఖీ చేశారు. గిడ్డంగుల్లోని బియ్యం, కందిపప్పు, చక్కెర స్టాక్ రికార్డులను పరిశీలించారు. బియ్యంతో పాటు ఇతర సరుకులను తూకంపై రేషన్ షాపులకు పంపిణీ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. తొలుత స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ తామెరా సుల్తానా, డీఎఫ్ఓ పార్వతి పాల్గొన్నారు.

వణుకూరు-మద్దూరు రోడ్డును బాగుచేయరూ..!



దెబ్బతిన్న రహదారి

పెనమలూరు: వణుకూరు-మద్దూరు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు నుంచి విజయవాడ-అవనిగడ్డ కరకట్ట రోడ్డుకు లింకు రోడ్డుగా ఉన్న గోసాల-వణుకూరు-మద్దూరు రహదారి దాదాపు ఆరు కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. చాలా సంవత్సరాల క్రితం ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. టీడీపీ పాలనలో అక్రమ ఇసుక రవాణా కారణంగా ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇసుక లారీలు విపరీతమైన లోడ్‌తో రోడ్డుపై వెళ్లడంతో పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు పై ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడితే చర్యలు



నిందితుడు, అక్రమ మద్యాన్ని మీడియాకు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

ఉయ్యూరు: అక్రమంగా మద్యం అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు ఎస్ఈబీ సీఐ ఎంఏ ఖదీర్ పేర్కొన్నారు. ఉయ్యూరు ఎస్ఈబీ ఆధ్వర్యంలో పెనమలూరు మండలంలోని యనమలకుదురు లంబాడీ పేటలో బుధవారం దాడులు నిర్వహించారు. సీఐ ఎంఏ ఖదీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో జి.నాగరాజు పట్టుబడ్డాడు. అతని ఇంటి వద్ద జరిపిన తనిఖీల్లో పుదుచ్చేరి నుంచి అక్రమంగా తీసుకొచ్చిన 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాటిళ్లతో పాటు నాగరాజును అదుపులోకి తీసుకుని ఉయ్యూరు కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో ఎస్ఐ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

5వ తేదీ నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నున్న(విజయవాడరూరల్): దేవదాయశాఖ ఆధ్వర్యంలో నున్న గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహనరావు తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, దీక్ష స్వీకరణ, అఖండస్థాపన, స్వామికి మహాన్యస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగును. 6వ తేదీన ఉదయం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, సాయంత్రం నిత్యార్చన, అనంతరం దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం రథోత్సవం, నిత్యార్చన, విశేషహోమాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



ఉయ్యూరులో పింఛన్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని



గంగూరులో వికలాంగురాలు సగ్గుర్తి శ్రీలక్ష్మికి పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది



నున్నలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు సునీత



గన్నవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్



ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ రాంప్రసాద్

ఉయ్యూరు: వైఎస్సార్ పింఛను కానుక పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో పింఛన్ల పంపిణీ బుధవారం వేకువజాము నుంచే ప్రారంభమైంది. ఈ నెల కొత్తగా నియమించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో కలిసి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అంతటా పింఛన్ల పంపిణీతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీలో తొలిరోజే 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని పేర్కొన్నారు. జిల్లాలో మూడో స్థానంలో నిలిచామన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు.

వేకువజామునే..

పెనమలూరు: మండలంలో బుధవారం ఉదయాన్నే లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేపట్టారు. మండల పరిధిలో 17,962 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.4,99 కోట్లు నిధులు మంజూరు చేసి విడుదల చేసింది. మండల పరిధిలో ఉన్న 30 గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వేకువజామునే పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. గంగూరులో వికలాంగురాలు సగ్గుర్తి లక్ష్మి ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము సచివాలయ సిబ్బంది అందజేశారు. పెనమలూరు పల్లిపేటలో మంచానికే పరిమితమైన తుమ్ము లాజర్ ఇంటికి వెళ్లి వలంటీర్ అల్లం దుర్గాభవాని పింఛన్ సొమ్ము అందజేసింది. మండలంలో మొదటి రోజు పింఛన్ దాదాపు 70 శాతం వరకు పంపిణీ చేశామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు.

రామవరప్పాడులో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని అర్హుల ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బుధవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడు లో మొత్తం 94 శాతం, ఎనికేపాడులో 96 శాతం, ప్రసాదంపాడులో 97 శాతం, నిడమానూరులో 94 శాతం పంపిణీ చేశారు. తొలి రోజు అన్నీ గ్రామాలు కలిపి 94 శాతానికిపైగా పంపిణీ పూర్తి చేశారు.

87 శాతం పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో మంగళవారం 87 శాతం మంది లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదల చేసిన పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. ఒకటో తేదీకి ప్రభుత్వం పెన్షన్లు ఇంటివద్దకు తీసుకెళ్లి అందచేస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం కనిపించింది.

ఉంగుటూరులో 6,479 మందికి..

ఉంగుటూరు: మండలంలో 8,019 మంది లబ్ధిదారులకుగాను 6,479మందికి పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జీవస్వీ శేషగిరిరావు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి వలంటీర్లు బుధవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు.

గన్నవరంలో 84.02 శాతం..

గన్నవరం: మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో బుధవారం తెల్లవారుజామున ప్రారంభమైన పింఛన్ల పంపిణీ సాయంత్రం ఆరు గంటలకు 84.02 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో 11,062 పింఛన్లకుగాను 9,294 మందికి వలంటీర్లు నగదు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

గన్నవరం రూరల్: ముస్తాబాద సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న మునిపల్లి రాంప్రసాద్ విజయవాడ స్వర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గూటాల కనకరత్నం దగ్గరకు వెళ్లి బుధవారం పెన్షన్ అందజేశాడు. మధుమేహంతో ఇబ్బంది పడుతూ కాలు ఇన్‌ఫెక్షన్ కావడంతో తీవ్ర ఇబ్బందిలో ఉన్న లబ్ధిదారు విషయం తెలుసుకున్న రాంప్రసాద్ నేరుగా ఆస్పత్రికి వెళ్లి ఆమెకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశాడు. వలంటీర్ సేవలను కార్యదర్శి లక్ష్మీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జెట్టి నానారావు అభినందించారు.

సంబరంగా..

కంకిపాడు: వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ సంబరంగా సాగింది. ఆయా గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందించారు. మండలంలో తొలి రోజు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. పునాదిపాడులో సచివాలయ కన్వీనర్ తాడుసు శ్రీను వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు సొమ్ము అందజేశారు. మంతెనలో చేపట్టిన పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు.

గంజాయి అమ్ముతున్న మహిళ అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధి శాంతినగర్లో ఓ మహిళ గంజాయి అమ్ముతుండగా పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. సీఐ కె.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు తుపాకుల రామకృష్ణ పార్కు వద్ద కుందురు జయమ్మ , చింతమాల రాజా అనే వ్యక్తికి గంజాయి అమ్ముతుండగా గత నెల 28వ తేదీ రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కిలో గంజాయి స్వాధీనం చేసుకొన్నారు. చింతమాల రాజా నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిద్దరి పై కేసు నమోదు చేశారు.

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు



ఎస్ఐ సుధాకర్‌ను సత్కరిస్తున్న పీవీరావు, గోగులమూడి రాజు

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పీవీరావు మాల మహానాడు ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై కె.సుధాకర్‌ను కలిసి సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పాతూరి చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.